ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
సోమవారం 12 ఫిబ్రవరి 2024





వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



నిధులు తక్కువ.. నీళ్లు ఎక్కువ..

- సాగునీటిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- బడ్జెట్‌లో ప్రాజెక్టులకు రూ.28,024 కోట్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు లబ్ధి
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు ప్రాధాన్యత

వరంగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తక్కువ నిధులతో ఎక్కువ ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టుల వైపు ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. తాత్కాలి క బడ్జెట్‌లో ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు రూ.28,024కోట్లు కేటాయించారు. అయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతాంగానికి దేవాదుల, చిన్నకాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులు పూర్తి అయితే 4లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందే అవకాశం ఉంది.

దేవాదుల.. ఇక వేగిరం..

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల వద్ద 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జె.చొక్కారావు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మూడువిడతల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని రూపకల్పన చేశారు. ప్రాజెక్టు పూర్తిచేసి 170రోజుల్లో 38.182 టీఎంసీలను లిఫ్ట్ చేయాలని, ఇందులో 2.842 టీఎంసీల నీటిని వరంగల్ నగరానికి తాగునీటికి కేటాయించాలని నిర్ణయించారు. మిగిలిన 35.34టీఎంసీల నీటిని 6.21లక్షల ఎకరాలకు సాగుకు మళ్లించటమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. అయితే మొదటి, రెండోదశ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దేవాదుల ప్రాజెక్టులో కీలకమైన మూడో దశ పనులు ముందుకు సాగటం లేదు. 2008లో మూడో దశ పనులు మొదలు పెట్టారు. 2011 డిసెంబరు 7వ తేదీ నాటికి పనులు పూర్తి కావాలి. ఈ దశలో 54.88కిలో మీటర్ల దూరం సొరంగం తవ్వాల్సి ఉంది. కానీ 2009 జూన్‌లో శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు వద్ద బుంగ పడటంతో దేవాదుల టన్నెల్‌లోకి నీళ్లు చేరి ముగ్గురు కార్మికులు జలసమాధి అయ్యారు. దీంతో రెండేళ్లకు పైగా మూడో విడత దేవాదుల పనులకు బ్రేక్ పడింది. అప్పటికే 42కిలోమీటర్ల సొరంగం తవ్వి, 53 శాతం లైనింగ్ పనులు పూర్తి చేశారు. బీంఘన్‌పూర్ నుంచి రామప్ప చెరువు మధ్యలో సొరంగం పనులు స్థానికులు అడ్డుకోటంతో 5.82కిలో మీటర్లు తగ్గించి 49.06కిలో మీటర్లకు సొరంగం పనులను కుదించారు. దీంతో ఇంకా 7కిలోమీటర్ల టన్నెల్ తవ్వి లైనింగ్ పూర్తి చేయాల్సి ఉంది. అయితే నిధులు కొరతతో దేవాదుల పనులు ముందుకు సాగటం లేదు. ఏటా బడ్జెట్‌లో అర కొరనిధులే కేటాయిస్తున్నారు. ప్రస్తుతం దేవాదుల ద్వారా వరంగల్ నగరానికి తాగునీరు అందిస్తుండటంతో పాటు సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మూడో దశ పనులు పూర్తి అయితే అదనంగా మరో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రభుత్వం దేవాదుల కోసం రూ.3,687.72కోట్ల నిధులను కేటాయించింది. టన్నెల్ పనులు పూర్తి చేయటంతో పాటు ప్రాజెక్టుకు కావాల్సిన సుమారు 3వేల ఎకరాల భూమిని జనగామ, హనుమకొండ, సిద్దిపేట జిల్లాలో భూసేకరణ చేయాల్సి ఉంది. మొత్తానికి దేవాదులపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో త్వరలోనే దేవాదుల ఫలాలు అందుతాయనే ఆశతో ఓరుగల్లు రైతాంగం ఎదురుచూస్తుంది.

చిన్న కాళేశ్వరంలో కదిలిక

భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభు త్వంలో కదిలిక వచ్చింది. 2008లో జలయజ్ఞం పథకం కింద అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. రెండు పంపుహౌస్‌ల ద్వారా 4.5 టీఎంసీల గోదావరి నీటిని లిఫ్ట్ చేసి కాటారం, మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మల్హర్ మండలాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం. ఇందుకోసం రూ.499కోట్ల అంచనా వ్య యంతో పనులు చేపట్టారు. బీరసాగర్, కాటారంలో రెండు చోట్ల పంపుహౌస్‌ల నిర్మాణంతో పాటు 8.5మెగా వాట్ల కెపాసిటీ గల ఏడు మోటర్లను బిగించారు. పైపులైన్, భూసేకరణతో పాటు మరికొన్ని పనుల కోసం రూ.325కోట్ల వరకు ఖర్చు చేశారు. ఆ తరువాత నిధుల కొరతతో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయక పోవటం నిరుపయోగంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో ప్రస్తుత బడ్జెట్‌లో రూ.283.37కోట్లు కేటాయించారు. దీంతో రాబోయే రెండేళ్లలో పనులు పూర్తి అయితే 45వేల ఎకరా లకు సాగునీరుతో పాటు సుమారు 100 గ్రామాల కు తాగునీటికి ఈ ప్రాజెక్టు ఉపయోగప డుతుం దనే ఆశతో స్థానికులు ఉన్నారు.

కాళేశ్వరానికి నిధులు లేనట్టే..

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రస్తుత బడ్జెట్‌లో పైసా నిధులు కేటాయించలేదు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద నిర్మించిన బ్యారేజీతో 45లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గత అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో కాళేశ్వరం ఎత్తిపోతలకు బ్రేక్ పడింది. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే భారీ బడ్జెట్ అవసరం. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పులకే రూ.17,114కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. రూ.1,534కోట్లు జీతభత్యాలు, ఇతర ఖర్చులకు పోనూ, మిగిలిన రూ.9,377కోట్లతో పాత ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. దీంతో ప్రభుత్వం కాళేశ్వరం జోలికి వెళ్లకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు అందే ప్రాజెక్టులపై దృష్టిపెట్టింది.

సీతారామకు రూ.900కోట్లు

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో గోదావరిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుతో మహబూబా బాద్ జిల్లాలోని రైతాంగానికి ప్రయోజనం చేకూరనుంది. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో 6.74 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.13,077కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే నిధుల కొరతతో ఐదేళ్లుగా ఈ ప్రాజెక్టు ముందుకు సాగటం లేదు. ప్రస్తుతం సీతారామ ప్రాజెక్టు కోసం అధికారులు రూ.2వేల కోట్ల కోసం ప్రతిపాదనలు పంపిస్తే, బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.900కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల్లో సుమారు 50వేల ఎకరాకలు సాగునీరు అందే అవకాశం ఉంది. అలాగే ములుగు జిల్లా వాజేడు మండలం మోడికుంట వాగు ప్రాజెక్టు, వెంకటాపురం మండలం పాలెం వాగు ప్రాజెక్టులకు పీఎం కృషి సించాయి యోజన పథకంలో అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

మేడారంలో మొక్కుల జోరు

- సమ్మక్క సారలమ్మల దర్శనాలకు భక్తుల బారులు
- రద్దీగా మారిన మేడారం పరిసరాలు



మేడారం, ఫిబ్రవరి 11 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహాజాతర ఈనెల 21 నుంచి ప్రారంభం కానుండగా వనదేవతలకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నలమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. 10 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవ తల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) చెల్లించుకున్నారు.

గద్దెలను తాకి పులకించి

మహా జాతరకు ముందుగా సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి మేడారం తరలి వచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను తాకి తరించి పోతున్నారు. మహా జాతరలో అవకాశం రాకపోవచ్చని భావిస్తూ ముందస్తుగా కుటుంబ సభ్యులతో తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్నారు.

రద్దీని నియంత్రించని పోలీసులు

మహా జాతరకు ముందుగా వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలివచ్చిన భక్తజనాన్ని గద్దెల వద్ద పోలీసులు నియంత్రించలేక పోయారు. దేవాదాయ, పోలీసు శాఖల అధికారులు తమ కుటుంబ సభ్యులు, శాఖల అధికారులు, బంధువులు, మిత్రులకు ప్రత్యేక దర్శనాలు కల్పించే పనిలో పడ్డారు. సామాన్య భక్తులకు మాత్రం దర్శనాల్లో ఇబ్బందులు తప్పలేదు. వీవీఐపీ, వీఐపీల దర్శనాల కారణంగా దగ్గరకు వెళ్లలేని భక్తులు దూరం నుంచే బెల్లం, కానుకలు, ముడుపులు విసిరారు. భక్తులందరినీ సమ దృష్టిలో చూడాలని, సామాన్యులకు దర్శన భాగ్యం కల్పించాలని కోరారు.

'ఆరోగ్య' జాతర!

- మేడారంలో పకడ్బందీగా వైద్య సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- 50 పడకలతో తాత్కాలిక వైద్యశాల
- 150 మంది డాక్టర్లు, 530 మంది పారామెడికల్ సిబ్బంది

7



మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతంలో సీఎం సభాస్థలిని చదును చేస్తున్న జేసీబీలు

సీఎం పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

- నిమగ్నమైన అధికార యంత్రాంగం

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు మంగళవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో వారు రానుండటంతో మహదేవపూర్ నుంచి మేడిగడ్డ వరకు రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. సెంట్రల్ లైనింగ్, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బ్యారేజీ పరిసర ప్రాంతంతోపాటు వంతెన, గోదావరి నదిలోకి వెళ్లే మార్గాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంగా ఆదివారం పనులు ప్రారంభించారు. బ్యారేజీ సందర్శనకు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు రోడ్డు మార్గంలోనే వస్తుండటంతో వారు ప్రయాణించే బస్సులతోపాటు వీఐపీల వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ప్రదేశాలను ఎంపిక చేశారు. సూరారం, అంబట్‌పల్లి వద్ద రెండు పార్కింగ్ ప్రదేశాలతోపాటు వీఐపీల పార్కింగ్‌ను మేడిగడ్డ బ్యారేజీ వద్దనే సభాస్థలికి కుడివైపు ఏర్పాటు చేస్తున్నారు. అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ కార్యాలయం సమీపంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.

సభాస్థలికి ప్రత్యేక మార్గాలు

మేడిగడ్డ బ్యారేజీ సమీపంలోని హోమశాల ప్రాంతంలో నిర్వహించే సభాస్థలికి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి వెళ్లేందుకు రెండు మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. మహదేవపూర్‌లోని బొమ్మాపూర్ మలుపు నుంచి బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, సూరారం గ్రామాల మీదుగా ఎల్‌అండ్‌టీ రోడ్డులో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు సభాస్థలానికి చేరుకోనున్నారు. అలాగే వెళ్లేటప్పుడు మేడిగడ్డ బ్యారేజీ నుంచి ఎల్‌అండ్‌టీ రోడ్డు ద్వారా నేరుగా కుదురుపల్లి వద్దనున్న జాతీయ రహదారి-353(సీ)కి కలిసేలా రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వచ్చే రూట్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు.

2,500 మంది నడుమ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా మేడిగడ్డ బ్యారేజీకి రానుండటంతో భారీస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ హోమశాల వద్ద సుమారు 2,500 మంది కూర్చొనేలా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నారు. బ్యారేజీకి దక్షిణం వైపు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు కూర్చొనేలా వేదికను ఏర్పాటు చేస్తున్నారు. వేదిక పక్కనే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపనున్నారు.

భారీగా ఎంపీడీవోల బదిలీలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చర్య

6

రోడ్డు ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు

8

చిన్నారులను మింగిన చెరువులు

- వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి
- తాడిచర్లలో మేకలను మేపడానికి వెళ్లి ఇద్దరు అన్నదమ్ములు..
- అమ్మాపురంలో ఈతకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు..
- భూపాలపల్లి, మానుకోట జిల్లాల్లో విషాదం



తాడిచర్లలో చిన్నారుల మృతదేహాలు (ఇన్‌సెట్‌లో ఫైల్)



అమ్మాపురంలో పడి మృతి చెందిన చిన్నారులు

మల్హర్/తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 11: చెరువులో పడి నలుగురు చిన్నారులు మృతి చెందారు. మేకలను మేపేందుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు చెరువులో దిగగా నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ప్రమాదం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామంలో జరిగింది. అలాగే ఈత కొట్టేందుకు చెరువుకు సరదాగా వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురంలో ఆదివారం జరిగింది. చిన్నారుల మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

మేకలను మేపేందుకు..

భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన బొంతల అనూష - రాజు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమారులు అరుణ్‌కుమార్(12), కార్తీక్ (9) తోపాటు ఓ కూతురు ఉంది. అరుణ్ కుమార్ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సమీపంలోని సన్నూర్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉన్న అతడు.. మూడు నెలల కిందట ఇంటికి వచ్చేశాడు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేకపోవడంతో అతడిని స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదిరోజుల కిందట చేర్పించారు. రెండో కుమారుడు కార్తీక్ స్థానికంగా నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవలే రాజు కొన్ని మేకలను కొన్నాడు. వాటిని అతడి భార్య అనూష మేపుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాజు వ్యక్తిగత పని నిమిత్తం కాళేశ్వరం వెళ్లాడు. రోజూలాగే అనూ ష మేకలు మేపుకుంటూ ఇద్దరు కొడుకులను కూడా తోడుగా తీసుకెళ్లింది. మధ్యాహ్న సమయంలో అనూష పిల్లలు ఇద్దరికి మేకలను అప్పగించి భోజనం చేయడానికి ఇంటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మేకలు ఇంటికి చేరాయి. ఇద్దరు పిల్లలు మాత్రం తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి.. చుట్టుపక్కల వెతికింది. చెరువు వద్దకు వెళ్లి చూడగా ఇద్దరి చెప్పులు కనిపించాయి. దీంతో ఏడుస్తూ గ్రామంలోకి వచ్చి కొంతమందిని వెంట తీసుకొని వెళ్లింది. చెరువులో గాలించగా ఇద్దరి కొడుకుల మృ తదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలా న్ని కాటారం సీఐ నాగేశ్వర్‌రావు పరిశీలించా రు. ఇద్దరు పిల్లలు చెరువులో వద్దకు ఎందుకు వెళ్లారు.. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు.

ఈతకు వెళ్లి..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మం డ లం అమ్మాపురం గ్రామానికి చెందిన గంధం స్వామి - రూప దంపతుల పెద్దకుమారుడు గంధం యాకూబ్ (14) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా తల్లి రూప, తమ్ముడు శ్రావణ్‌కుమార్ తో కలిసి ఉంటున్నాడు. అలాగే ఇదే గ్రా మానికి చెందిన కిన్నెర మహేష్-సావిత్రి దంపతుల కుమారుడు జంపా (12) స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా, నాన్నమ్మ గజ్జెలమ్మతో ఉంటున్నాడు.

ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో వీరిద్దరు మరో నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న పెద్దచెరువు వద్దకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. చెరువు ఒడ్డున ఈతకొడుతూ ఒక్కసారిగా లోతులోకి వెళ్లారు. దీంతో ఇద్దరు చిన్నారులు నీటిలో మునిగి అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై కూచిపుడి జగదీశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంధం రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏజెన్సీ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- భూటారం, ఎలిశెట్టిపల్లిలో నూతన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- రూ. 4 కోట్ల 5 లక్షలతో పనులు



భూటారం నుంచి ఎలిశెట్టిపల్లి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం, ఫిబ్రవరి 11 : ఏజెన్సీ ప్రాంత అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలో ఆమె ఆదివారం పర్యటించారు. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి మంజూరైన అభివృద్ధి పనులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, డి.వేణుగోపాల్, ఏఎస్పీ సంకీర్త్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఏటూరునాగారం మండలం భూటారం నుంచి మండలంలోని ఎలిశెట్టిపల్లి వరకు రూ. 4 కోట్ల 5 లక్షల నిధులతో చేపడుతున్న రోడ్ల నిర్మాణంతోపాటు హైలెవెల్ వంతెన తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది వర్షాకాలంలో సంభవించిన గోదావరి వరద వల్ల జంపన్నవాగు పొంగడంతో ఎలిశెట్టిపల్లికి వెళ్లే రోడ్డు పూర్తి కొట్టుకుపోయిందన్నారు. ఆ గ్రామానికి రోడ్డు నిర్మాణం సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణానికి రూ. 4 కోట్లు కేటాయించామని తెలిపారు. మొత్తం రూ. 4 కోట్ల 5 లక్షలలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలువురు మంత్రికి వివిధ సమస్యలను వివరించారు. వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్, కన్నాయిగూడెం జడ్పీటీసీ నామ కరంచంద్ గాంధీ, కాంగ్రెస్ కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు ఎమ్డీ. అఫ్సర్, ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, టౌన్ ఉపాధ్యక్షుడు మామిడి రాంబాబు, టౌన్ అధ్యక్షుడు సరికొప్పుల శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 11: గురుకులాల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతిలో అడ్మిషన్ పొందడానికి ఐదో తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 2,294 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,021 మంది పరీక్ష రాశారు. 223 మంది గైర్హాజరయ్యారు. పరీక్షను ఆర్‌సీవో విద్యారాణి, డీసీవో బిక్షపతి పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

'కాళేశ్వరం'పై చర్చకు బీఆర్ఎస్ సిద్ధం కావాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 11: కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చర్చకు సిద్ధం కావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మేడిగడ్డకు వస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టుపై బహిరంగం చర్చకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. అవినీతి జరిగిందా.. లేదా? అనే విషయాలపై నిజనిజాలు నిగ్గు తేల్చుకుందామని అన్నారు. లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టు కొంతకాలానికే కుంగిపోవడం ఏమిటో బీఆర్ఎస్ నేతలకే తెలియాలని వ్యాఖ్యానించారు. సముద్రాన్ని పక్కనే పెట్టుకుని చేప దూపకు ఏడ్చినట్లు ఈ ప్రాంత రైతుల పరిస్థితి దాపురించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కనీసం వంద రోజులు గడవక ముందే రకరకాలుగా ప్రశ్నించడం చూస్తే దొంగే దొంగ అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో దళితులకు మూడెకరాల భూమి దక్కలేదని, కేజీ టు పీజీ విద్య అందలేదని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, ఇంటికో ఉద్యోగం రాలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన కొద్ది రోజుల్లోనే రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకువెళ్లేందుకు రూ.40వేల కోట్లు పెట్టుబడులు తెస్తున్నారని అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సైతం ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కడతారని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మరథం పట్టాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, అప్పం కిషన్, ఆకుల మహేందర్, సాంబమూర్తి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్?

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: కేయూ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఇక్కడికి బదిలీ అయిన శ్రీధర్ రాకను మంత్రి ద్వారా అడ్డుకున్నట్లు సమాచారం. కాగా, కొన్ని రోజుల కిందట వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు జరగగా.. కేయూలో పని చేసిన అబ్బయ్య పరకాలకు బదిలీ అయ్యారు. ఇక్కడికి ఖమ్మంలో పని చేస్తున్న సీహెచ్. శ్రీధర్‌ను నియమించారు. అయితే శ్రీధర్ రాకపై సందిగ్ధత ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలంపాటు ఎస్ఐ, సీఐగా పని చేసిన శ్రీధర్ అక్కడి బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. అక్కడ చాలామంది కాంగ్రెస్ కార్యకర్తలను వేధించడంతోపాటు కొందరిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేసినట్టు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ కమిషనరేట్‌లోని కీలకమైన కేయూ పీఎస్‌లో పోస్టింగ్ పొందడాన్ని అక్కడి నేతలు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. ఎలాగైనా శ్రీధర్ పోస్టింగ్‌ను రద్దు చేయాలని విదేశాల్లో ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రిపై ఒత్తిడి చేసినట్టు సమాచారం. దీంతో సీపీకి విషయం తెలుపగా ఆయన నిఘావర్గాల ద్వారా శ్రీధర్ సర్వీస్ గురించి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఓ ఉన్నత స్థాయి అధికారి శ్రీధర్‌కు ఫోన్ చేసి కేయూ పీఎస్‌లో జాయిన్ కావొద్దని సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో శ్రీధర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. అయితే కేయూకు వీఆర్, ఎస్‌బీలో ఉన్న ఓ అధికారుల్లో ఎవరికైనా విధులు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

భారీగా ఎంపీడీవోల బదిలీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది ఎంపీడీవోలు పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. మరో రెండు మాసాల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఒకే స్థానంలో మూడేళ్ల సర్వీసు పూర్తి అయిన ఎంపీడీవోలను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 395 మంది ఎంపీడీవోలు బదిలీ కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది బదిలీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 5 ఎంపీడీవోలు, జనగామ జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా నుంచి 8 ఎంపీడీవోలు, మహబూబాబాద్ జిల్లా నుంచి 16 ఎంపీడీవోలు, ములుగు జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, వరంగల్ నుంచి 10 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. సోమవారం రిలీవ్ కానున్న ఎంపీడీవోలు మంగళవారం వారికి కేటాయించిన జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

- **హనుమకొండ జిల్లా ఎంపీడీవోలు :** జవహర్‌రెడ్డి ములుగు జిల్లాకు, టి.సునిత కరీంనగర్, జి.వెంకటరమణ వరంగల్, ఎల్.భాస్కర్ జయశంకర్ భూపాలపల్లి, ఆర్.రామకృష్ణ ములుగు బదిలీ అయ్యారు.
- **జనగామ జిల్లా ఎంపీడీవోలు:** మహ్మద్ హసీం సూర్యాపేట, బి.సురేందర్ ఖమ్మం, వి.అశోక్‌కుమార్ ఖమ్మం, శ్రీధర్‌స్వామి ఖమ్మం, పి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, వి.రాజా త్రివిక్రం సిద్దిపేట బదిలీ అయ్యారు.
- **భూపాలపల్లి జిల్లా ఎంపీడీవోలు:** కె.అనిల్‌కుమార్ హనుమకొండ, ఎల్.అరుంధతి వరంగల్, పి.ఆంజనేయులు వరంగల్, జి.సురేందర్ ఖమ్మం, ఎం.శంకర్ వరంగల్, జి.నరసింగహమూర్తి వరంగల్, ఎ.రవీంద్రనాథ్ ఆదిలాబాద్, వి.క్రిష్ణవేణి వరంగల్ బదిలీ అయ్యారు.
- **మహబూబాబాద్ జిల్లా ఎంపీడీవోలు:** జి.రవిందర్‌రావు భద్రాద్రి కొత్తగూడెం, ఎం.సత్యనారాయణరెడ్డి సూర్యాపేట, జి.రవిందర్ ఖమ్మం, వి.అపర్ణ రంగారెడ్డి, పి.వెంకటేశ్వర్లు హనుమకొండ, బి.వి.చలపతిరావు భద్రాద్రి కొత్తగూడెం, ఎస్.కుమార్ ఖమ్మం, బి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, బి.భారతి భద్రాద్రి కొత్తగూడెం, కె.ధన్‌సింగ్ భద్రాద్రి కొత్తగూడెం, బి.గోవిందరావు వరంగల్, కె.శ్యాంసుందర్ జయశంకర్ భూపాలపల్లి, కె.వెంకటేశ్వర్లు జయశంకర్ భూపాలపల్లి, పి.సరస్వతి ఖమ్మం, ఎ.రోజారాణి ఖమ్మం, కె.శేషాద్రి ఖమ్మం బదిలీ అయ్యారు.
- **ములుగు జిల్లా ఎంపీడీవోలు:** అబ్బూరి ఫణిచంద్ర వరంగల్, సీహెచ్.శ్రీనివాస్, వరంగల్, జె.ప్రవీణ్‌కుమార్ హనుమకొండ, ఎం.సత్యాంజనేయ ప్రసాద్ యాదాద్రి భువనగిరి, ఎండీ.ఇక్బాల్ హుస్సేన్ జయశంకర్ భూపాలపల్లి, అద్దూరిబాబు జయశంకర్ భూపాలపల్లి బదిలీ అయ్యారు.
- **వరంగల్ జిల్లా ఎంపీడీవోలు:** సీహెచ్.సంతోష్‌కుమార్ సూర్యాపేట, టి.రాజ్యలక్ష్మీ ములుగు, ఎ.క్రిష్ణమూర్తి మెదక్, జి.క్రిష్ణ ప్రసాద్ ములుగు, ఎస్.విజయ్‌కుమార్ హనుమకొండ, ఎస్.వీరేషం హనుమకొండ, జి.రాజేంద్రప్రసాద్ ములుగు, పి.సుమనవాణి ములుగు, ఎం.వెంకటేశ్వర్‌రావు జయశంకర్ భూపాలపల్లి, జి.అనిత ములుగుకు బదిలీ అయ్యారు.

వైద్యులపై చర్యలు తీసుకోండి..

హసన్‌పర్తి పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: గాల్‌బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని తన భార్యను ఆస్పత్రిలో చేరిస్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణం పోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓబాధితుడు హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి తెలిపిన ఫిర్యాదు మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వరంగ ల్ జిల్లా కరీమాబాద్ తోటకు చెందిన ఎమ్డీ అన్వర్ తన భార్య నస్రీన్‌కు గాల్ బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని చికిత్స కోసం ఆరెపల్లిలోని రిలీఫ్ ఆస్పత్రిలో ఈ నెల 5న చేర్పించారు. 9వ తేదీన అక్కడి డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత కొంత సమయానికి నస్రీన్‌కు మూత్రం ఆగిపోయింది. ఉదయం నుంచి సా యంత్రం వరకు చికిత్స చేసినట్టు చేసి చివరికి పరిస్థితి విషమించిందని, మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని వేరే ఆస్పత్రికి తీసుకుపోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. అక్కడికి వెళ్లి చికిత్స చేస్తుండగా శనివారం సా యంత్రం నస్రీన్ మృతి చెందింది. తనభార్య మరణానికి రిలీఫ్ ఆస్పత్రి సిబ్బందే కారణమని, అక్కడి డాక్టర్లతోపాటు నిర్వాహకులను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

'మల్లికాంబ'లో అన్నదానం



అన్నదానం చేస్తున్న రామమ్ చిట్‌ఫండ్స్ ప్రతినిధులు

సుబేదారి, ఫిబ్రవరి 11: రామమ్ చిట్‌ఫండ్స్ 16వ వార్షికోత్సవం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉన్న మానసిక వికలాంగులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామమ్ చిట్ ఫండ్స్ చైర్మన్ బన్న సుధాకర్, ఎండీ శ్రీరామోజు గిరిబాబు, చిట్ ఫండ్స్ సిబ్బంది, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


మేడారంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రధాన వైద్యశాల

‘ఆరోగ్య’ జాతర!

- మేడారంలో పకడ్బందీగా వైద్య సేవలు
- వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- 50 పడకలతో తాత్కాలిక వైద్యశాల
- జాతర పరిసరాలు, దారుల్లో 72 మెడికల్ క్యాంపులు
- 150 మంది డాక్టర్లు, 530 మంది పారామెడికల్ సిబ్బంది నియామకం

ములుగు, ఫిబ్రవరి 10: మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. ఈసారి ప్రభుత్వం రూ. కోటి నిధులను కేటాయించగా ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. జాతర పరిసరాల్లో తాత్కాలిక పెద్దాస్పత్రి, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఓపీ సేవలు కొనసాగుతుండగా, ఈనెల 20నుంచి జాతర ముగిసేంత వరకు ఇన్‌పేషెంట్ సేవలను అందించనున్నారు. ఎప్పటిలాగే మేడారం జాతరలో 50 పడకలతో తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో తొమ్మిది మంది వైద్యనిపుణులు పనిచేయనున్నారు. షిఫ్టునకు 10మంది చొప్పున స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలతో ఇక్కడ ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ 24 గంటల సేవలను అందించనున్నారు. మేడారం ఇంగ్లీష మీడియం స్కూళ్లలో ఆరు బెడ్లతో మెడికల్ క్యాంపును ఏర్పాటుచేసి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. అదేవిధంగా జాతర పరిసరాల్లో 30మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. చింతల్, నార్లాపూర్, కొత్తూరు, కాల్వపల్లి క్రాస్‌రోడ్డు, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు-రెడ్డిగూడెం రోడ్ డ్యామ్, జంపనవాగు, ఊరట్టం కాజ్‌వే, రెడ్డిగూడెం, కొంగల మడుగు, ఆర్‌టీసీ బస్టాండు, ఇంగ్లీష మీడియం స్కూల్, మేడారం చెరువు, పోలీసు క్యాంపు, చిలుకలగుట్ట, వీవీఐపీ పార్కింగ్ ప్లేస్, పడిగాపూర్, హరిత హోటల్, కొత్తూరు సబ్‌స్టేషన్, వెంగ్లాపూర్, మేడారం-తాడ్వాయి రోడ్డు, గద్దెల ప్రధాన ద్వారం, బయ్యక్కపేట రోడ్డు, కన్నెపల్లి జంక్షన్ రోడ్డు, ఊరట్టం రోడ్డు మామిడి తోట, మేడారం గ్రామపంచాయతీ సమీపంలోని రెండో గేటు వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు.

అదేవిధంగా మేడారం వచ్చే ప్రధాన దారుల్లో కూడా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. గూడెప్పాడ్, కటాక్షపూర్, మల్లంపల్లి, గట్టమ్మ దేవాలయం, జంగాలపల్లి క్రాస్‌రోడ్డు, చల్వాయి క్రాస్‌రోడ్డు, లక్నవరం, పస్రా, కాల్వపల్లి, రేగులగూడెం, పెగడపల్లి, బోర్లగూడెం, కాటారం, తాడ్వాయి, బీరెల్లి, కొత్తూరు, కాటాపూర్, ఆకులవారి ఘనపూర్, ముల్లకట్ట బ్రిడ్జి, జగన్నాధపురం, చీకుపల్లి, టేకులగూడెం, వెంకటాపురం, మంగపేట, మల్లూరు, రాజుపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్, బయ్యక్కపేట, దూదేకులపల్లి, రాంపూర్, మేడారం క్రాస్‌రోడ్డు, రామప్ప, గుర్రంపేట, గణపురం క్రాస్‌రోడ్డు వద్ద మొత్తం 42 క్యాంపులు ఏర్పాటవుతున్నాయి. భక్తులు చిన్న అనారోగ్యానికి గురైనా ఈ శిబిరాలను సంప్రదిస్తే అక్కడ 24గంటలు అందుబాటులో ఉండే డాక్టర్లు, సిబ్బంది వైద్యసేవలను అందించనున్నారు. ఇద్దరు డాకర్లు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సహాయక సిబ్బంది కలిపి మొత్తం 10మంది విధుల్లో ఉంటారు.


భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


మేడారం తాత్కాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

680 మంది డాక్టర్లు, సిబ్బంది

వైద్య, ఆరోగ్య శాఖ పెద్ద సంఖ్యలో వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని జాతర విధులకు నియమించనుంది. 150 మంది వైద్యులు, 530 మంది పారామెడికల్ సిబ్బందితో భక్తులకు సేవలు అందించనుంది. ములుగు, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ జిల్లాల నుంచి 150 మంది డాక్టరను పిలిపిస్తున్నారు. అదే విధంగా ఎంజీఎం, సీకేఎం, రీజనల్ ఐహాస్పిటల్, జీఎంహెచ్ నుంచి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. 60మంది నాలుగో తరగతి ఉద్యోగులు సహాయకులుగా సేవలందించనున్నారు. ఐఎంఏ సహకారంతో ఓ గుండెవైద్య నిపుణుడిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ ఈసీజీ టెక్నీషియన్‌ను కూడా నియమించనున్నారు.

40 బైక్ అంబులెన్స్‌లు

మహాజాతర సమయంలో మేడారం పరిసరాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దారులన్నీ ఇసుకేస్తే రాలనంత తయారవుతాయి. ఈ సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. అత్యవసర సేవల కోసం బైక్ అంబులెన్స్‌లను వినియోగించనున్నారు. ఇందుకు 40బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 108 అంబులెన్స్‌లు 16ను కూడా సిద్ధం చేస్తున్నారు. ములుగు, ఏటూరునాగారం, తాడ్వాయి, పస్రా ఆస్పత్రుల వద్ద అత్యవసర సేవల కోసం నాలుగు అంబులెన్స్‌లు, ఆరు ఆర్‌బీఎస్‌కే, మూడు ఎంసీహెచ్ వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నారు. అదేవిధంగా 120 మంది 108సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నారు.

ఏడుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లు

అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు జరిపేందుకు ఆరుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లను(రెఫరల్ హాస్పిటల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, భూపాలపల్లి, పరకాల సీహెచ్‌సీలు, తాడ్వాయిలోని పీహెచ్‌సీలో 10పడకలు, పస్రాలో ఐదు పడకలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

కొనసాగుతున్న వైద్యసేవలు

జనవరి 14 నుంచి మేడారంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 3,850 మందికి ఓపీ సేవలు అందించారు. 50వేల మాస్కులు, రూ.7లక్షల 50వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈనెల 13 నుంచి 24 గంటల వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర జరిగే 21 నుంచి 24వ తేదీ వరకు ప్రతి రోజూ తొమ్మిది మంది వైద్య నిపుణులు 24 గంటలూ విధుల్లో ఉంటారు. తాడ్వాయిలో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.42లక్షలతో సెంట్రల్ డ్రగ్ స్టోరేజ్ సెంటర్ నుంచి మందులు తెప్పిస్తున్నారు. ఈసారి కోటి 60లక్షల మంది భక్తులు జాతరకు వస్తారని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. 2022 జాతరలో మొత్తం 2 లక్షల 9వేల మంది ఓపీ, 5,222మందికి ఐపీ సేవలు అందించింది.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

డాక్టర్ అల్లెం అప్పయ్య, ములుగు జిల్లా డీఎంహెచ్‌వో



మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. తాత్కాలిక ప్రధాన ఆస్పత్రిలో ఈనెల 13నుంచి జాతర ముగిసేంత వరకు 24గంటల వైద్యసేవలు అందిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో జాతరలోని ప్రధాన ఆస్పత్రికి రాలేని పరిస్థితిలో ఇప్పుడు వాడుతున్న మందులను వెంట తెచ్చుకోవడం మంచిది. సురక్షితమైన ఆహారం, తాగునీటిని తీసుకోవాలి. ముఖానికి తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. ఏదైనా అనారోగ్యం సోకితే సమీపంలోని వైద్య శిబిరానికి వెళ్లి ఉచితంగా సేవలు పొందాలి.


ములుగులో ఇసుక లారీలను దారి మళ్లిస్తున్న పోలీసులు

ఇసుక లారీలపై నియంత్రణేదీ?!

నిలుపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోని యంత్రాంగం

ములుగు, ఫిబ్రవరి11: మేడారం భక్తులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. జాతీయ రహదారి పనులకు తోడు ఇసుక లారీల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలతోపాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని ఇసుక క్వారీల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు వరంగల్, హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. జాతరకు సమయం దగ్గరపడుతుండగా పెద్ద సంఖ్యలో భక్తులు వాహనాలలో తలివస్తున్నారు. ఆర్టీసీ కూడా స్పెషల్ సర్వీసులను నడిపిస్తోంది. ఈనేపథ్యంలో లారీల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇదే సమయంలో ములుగు-గూడెప్పాడు మధ్య 163జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా జరుగుతున్నాయి. గట్టమ్మ దేవాలయం-మల్లంపల్లి మధ్య రహదారి కంకర పోసి చదును చేస్తున్నారు. కల్వర్టు పనులూ కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో భారీగా వచ్చే వాహనాలు దారి ఇరుగ్గా ఉండటంతో ముందుకు కదలలేక పోతున్నాయి. ఆదివారం భూపాల్‌నగర్ స్టేజీ వద్ద ఓ లారీ రోడ్డుపైనే దిగబడటంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో మేడారం భక్తులు, సాధారణ ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తక్షణమే స్పందించిన పోలీసులు ఇసుక లారీలను ములుగులో దారి మళ్లించారు. బస్సులు, ఇతర వాహనాలను ముందుకు అనుమతించారు. గట్టమ్మ దేవాలయం మూలమలుపు వద్ద కల్వర్టు పనులు జరుగుతుండటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇసుక లారీలను నిలిపివేతపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఇటీవల మంత్రి సీతక్క అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అయితే ఆదిశగా చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. జాతీయ రహదారి పనుల జాప్యంపై కూడా మంత్రి అసహనం వ్యక్తంచేశారు. అయితే పనులు జరుగుతున్న ప్రదేశాలు, ఇరుకైన కల్వర్టుల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటే కొంతవరకు సమస్య పరిష్కారమయ్యేది. కానీ, వాహనాలు నిలిచిపోయేదాకా ఎవ్వరూ స్పందించకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ఇసుకలారీలపై ఆంక్షలు విధించాలని, జాతీయ రహదారి విస్తరణ జరిగే ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.


వనదేవతలకు మొక్కుతున్న మంత్రి సీతక్క ఎస్పీ పీవో

సకల సౌకర్యాలతో మహాజాతర

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 11: మహా జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహాజాతరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జాతరకువచ్చే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్య కల్పిస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై మేడారానికి రానున్నారని, అందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశామని అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు ఉన్నారు.

ఉత్సవ కమిటీని ప్రతిపాదించిన మంత్రి

మేడారం మహాజాతర నిర్వహణకు ఉత్సవ కమిటీపై మంత్రి సీతక్క దేవాదాయశాఖ కమిషనర్‌కు 15మందితో ప్రతిపాదనలు పంపారు. ఛైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్‌తోపాటు 14 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. మిలుకూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచ హైమావతి, చామర్తి కిశోర్, కోరం అబ్బయ్య, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా సిద్దబోయిన జగ్గారావు పేర్లను పేర్కొన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న గద్దెల ప్రాంగణం


బెల్లంతో వెళుతున్న భక్తురాలు

మేడారంలో మొక్కుల సందడి

వనదేవతల దర్శనానికి తాకిడి




యాటను మొక్కుతున్న దృశ్యం


వనదేవతల దర్శనానికి బెల్లంతో వెళుతున్న మహిళా భక్తులు


జంపన్నవాగు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న దృశ్యం

మంత్రి సీతక్క సుడిగాలి పర్యటన

ఏటూరునాగారం, ఫిబ్రవరి 11: రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఏటూరునాగారం ఆకులవారిఘణపురంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ సూర్య షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించగా బహుమతుల ప్రదానోత్సవంలో ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. గిరిజన విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం ఐటీడీఏ నుంచి కావాల్సిన అన్నిరకాల సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కరాటే పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 600 మంది విద్యార్థులు, 40 మంది వివిధ పాఠశాలల కరాటే మాస్టర్లు, కోచ్‌లు పాల్గొనానరు. వారికి భోజనంతో పాటు వసతి ఏర్పాట్లను, క్రీడాకారులకు కావాల్సిన బహుమతులను ఏటూరునాగారం ఐటీడీఏ తరఫున సమకూర్చుతున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్, ఫౌండర్, టెక్నికల్ డైరెక్టర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ కరాటే, యోగా కోచ్ పాయం సురేష్, కొమురంభీం సేడ్డియం మాస్టర్ ఇర్ప బాలాజీ, కేజీబీవీ చల్వాయి, పస్ర జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మాస్టర్ గొంది మొగిళి, ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి, తాడ్వాయి కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల మాస్టర్ ఖైపతి సంతోష్‌కుమార్, మేడారం ఇంగ్లిష్ మీడియం పాఠశాల మాస్టర్స్ చంద హన్మంతరావు, కేజీబీవీ, జడ్పీహెచ్‌ఎస్ వాజేడు, ఆలుబాక, వెంకటాపురం(నూగూరు) పాఠశాలాల మాస్టర్స్ గొంది హన్మంతు, పూనెం రామారావు, తాడ్వాయి, నార్లాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలాల మాస్టర్స్ గొంది లక్ష్మణమూర్తి, మహేష్, కేజీబీవీ కర్కగూడెం, పినపాక మాస్టర్స్ చుంచ వెంకటేశ్వర్లు, లావణ్య, కేజీబీవీ చుంచుపల్లి మాస్టర్ చంద హన్మంతరావు, ఏటూరునాగారం టీడబ్ల్యూ క్రీడా పాఠశాల మాస్టర్స్ ధనసరి శ్రీనివాస్, కుర్సం రవితో పాటు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి సీతక్క

వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి శంకుస్థాపన

వెంకటాపూర్(రామప్ప : మండలంలోని పాలంపేట గ్రామంలో వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి మంత్రి ధనసరి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 382లో 28 గుంటల ప్రభుత్వ భూమిని వృద్ధాశ్రమ భవనానికి కేటాయించినట్టు తెలిపారు. సమాజంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధుల కోసం రూ.90లక్షలు వెచ్చించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రభుత్వం ద్వారా మరిన్ని సేవలందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఎంపీపీ బుర్రి రజిత, జడ్పీటీసీ గై రుద్రమదేవి, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, తహసీల్దార్ శివకుమార్, ఎంపీడీవో శ్రీనివాస్; ప్రజాప్రతినిధి మునిగంటి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అకినేపల్లి-మల్లారం అభివృద్ధికి కృషి

మంగపేట : ములుగు జిల్లా సరిహద్దు గ్రామామైన అకినేపల్లి-మల్లారం, ఎస్టీకాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) హామీ ఇచ్చారు. మండలంలోని అకినేపల్లి- మల్లారం శివారు గ్రామామైన ఎస్టీ కాలనీకి చెందిన మంత్రి సీతక్క ముఖ్య అనుచరుడు లక్కి వెంకన్న తండ్రి పిచ్చయ్య దశదినకర్మ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. పిచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ క్రమంలో గ్రామస్థులు ఎస్టీ కాలనీలో పేరుకు పోయిన సమస్యలను తీర్చాలని మంత్రిని కోరారు.. ములుగు జిల్లా చిట్టచివరి గ్రామామైన అకినేపల్లి-మల్లారాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని మంత్రి గ్రామస్థులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం జడ్పీటీసీ నామ కరం చంద్‌గాంధీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖైల జయరామిరెడ్డి, మంగపేట సహకార సంఘం మాజీ చైర్మన్ వల్లెపల్లి శివప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకులు అయ్యోరి యానయ్య, పూజారి సురేందర్‌బాబు, మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు యర్రంకాని సురేష్, చాద మల్లయ్య, లక్కి అనిల్‌రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన రిటైర్డు పోలీస్ ఉద్యోగులు


డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రిటైర్డు పోలీస్ ఉద్యోగులు

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 11: రాష్ట్ర డీజీపీ రవిగుప్తాను ఉమ్మడి వరంగల్ జిల్లా రిటైర్డు పోలీస్ ఉద్యోగులు హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో ఆదివారం భేటీ అయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పులి వీరారెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు వారు పుష్పగుచ్ఛం అందజేశారు.మెడికల్ బిల్లులు, పీఆర్సీ బకాయిలతోపాటు తదితర సమస్యలను డీజీపీకి వివరించి వినతిపత్రం అందజేశారు. డీజీపీని కలిసిన వారిలో సంజీవరెడ్డి, శ్యాంసుందర్‌రావు, తదితరులు ఉన్నారు.

పరీక్షకు విద్యార్థులను తీసుకొచ్చి...

గుండెపోటుతో టీచర్ హఠాన్మరణం


రాజ్‌కుమార్ (ఫైల్)

కాటారం, ఫిబ్రవరి 11: తమ పాఠశాల విద్యార్థులను గురుకుల ప్రవేశపరీక్ష రాయించడానికి తీసుకొచ్చిన టీచర్ గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. జిల్లాలోని గోరికొత్తపల్లి మండల కేంద్రంలోని చైతన్యభారతి పాఠశాలకు చెందిన టీచర్ పి.రాజ్‌కుమార్(40) కాటారంలోని గిరిజన గురుకుల విద్యాలయం సమీపంలో గుండెపోటుతో మృతిచెందారు. ఎస్టీ గురుకులంలో పాఠశాల విద్యార్థులను గురుకుల ప్రవేశపరీక్ష రాయించ డానికి తీసుకొచ్చి విద్యాలయం సమీపంలోని మైదానంలో చెట్టు కింద కూర్చొని సేద తీరారు. ఈ క్రమంలోనే గుండెపోటు కుప్పకూలి పోయారు. అక్కడే ఉన్న వారు గమనించి 108 అంబులెన్స్ ద్వారా ఆస్ప త్రికి తరిస్తుండగానే రాజ్‌కుమార్ మృతిచెందారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, ఫిబ్రవరి 11: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని చెల్పూరు, బస్వరాజుపల్లి, ధర్మరావుపేట, నగరంపల్లి, గణపురం, గాంధీనగర్, లక్ష్మారెడ్డిపల్లి, కర్కపల్లి బుద్దారం గ్రామ పంచాయితీల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రభుత్వం హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, వైస్ ఎంపీపీ చోటే మియా, కో ఆప్షన్ సభ్యుడు చోటేమియా, చెల్పూరు పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, పొట్ల నగేష్ పాల్గొన్నారు.


గణపురంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కారు బోల్తా.. ఆరుగురికి గాయాలు


మహాముత్తారంలో బోల్తా పడిన కారు

మహాముత్తారం, ఫిబ్రవరి11: కారు బోల్తా పడి ఆరుగురికి గాయాలైన సంఘటన మండల కేంద్రం శివారులోని ప్రభత్వ ఆస్పత్రి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. భూపాలపల్లి మండలం ఆజంనగర్‌కు చెం దిన కొండబత్తుల తిరుపతితో పాటు మరో ఐదుగురు మహాముత్తారం మండలం యామన్‌పల్లికి ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో మలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఐదు గురికి స్వల్ప గాయాలు కాగా కారు నడుపుతున్న తిరుపతికి బలమైన గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై సుధాకర్ క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

నేడు జాతర దుకాణాలకు వేలం

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 11: మొగుళ్లపల్లి-ములుకలపల్లి గ్రామాల మధ్య ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర నేపథ్యంలో సోమవారం వివిధ దుకాణాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారి నాగేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. కొబ్బరికాయలు, బెల్లం, కొబ్బరికాయల చిట్టీలు, కోళ్లు, ప్లాట్లు, తలనీలాలు, లడ్డూప్రసాదం, తదితర షాపులు నిర్వహించుకునేందుకు వేలంపాటను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు పాల్గొనాలని ఆయన కోరారు.

కల్లాల్లో మిర్చి మాయం

చిట్యాల, ఫిబ్రవరి 11: ఆరుగాలం కష్టించి పండించిన మిర్చిపంట చేతికొచ్చే సమయంలో చోరీకి గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కైలాపూర్ శివారు బూర్గుల రాయకొమురు, బోయిని సమ్మయ్యకు చెందిన మిర్చి కల్లాల్లోని మిరపకాయలు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. దీంతో నిందితులను పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు చిట్యాల పోలీసులను ఆశ్రయించారు. మిర్చి కల్లాల్లో తాలుకాయ ఏరి కుప్పలు పోసి ఉంచామని, ఆదివారం బస్తాల్లో నింపేందుకు వెళ్లగా సుమారు ఏడు క్వింటాళ్ల చోరీకి గురైందని బాధితులు తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

హేమాచలుడిని దర్శించుకున్న విద్యా శాఖ అధికారులు

మంగపేట, ఫిబ్రవరి 11: మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామిని విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదివారం దర్శించుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారులు బద్దం సుదర్శన్‌రెడ్డి, మాలోత్ సారయ్యానాయక్, లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఆజాద్ చంద్రశేఖర్, భాస్కర్, భద్రయ్య, సాంబశివరావు స్వామి వారితోపాటు ఉప దేవాలయాల దేవతలను దర్శించుకున్నారు. వారి వెంట మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి : ఎమ్మార్పీఎస్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 11: హైదరాబాద్‌లో ఈనెల 13న జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జాతి అస్తిత్వం, ఆత్మగౌరవం, భవిష్యత్ కోసం జరుగుతున్న న్యాయపోరాటంలో సామాజిక న్యాయ ఉద్యమం అంతిమఘట్టానికి చేరుకుందని, త్వరలోనే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై న్యాయమైన తీర్పు వెలువరించనుందని పేర్కొన్నారు. జాతీయ కార్యవర్గ సమావేశానికి జిల్లాలోని మాదిగలు పెద్దసంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 11: విద్యారంగానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్.రవి ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు ఆదివారం ములుగులో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి అతితక్కువ బడ్జెట్ కేటాయించి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తక్కువ బడ్జెట్ కేటాయించడం సరికాదని అన్నారు. విద్యారంగానికి 30 శాతం బడ్జెట్‌ను కేటాయించాలని, లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవితేజ, శివకుమార్, సిద్ధార్థ, సూర్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవి

రోడ్డు ప్రమాదంలో విలేకరులకు గాయాలు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 11: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విలేకరులకు గాయాలైన సంఘటన భూపాలపల్లి మండలంలోని దూదేకులపల్లి గ్రామం వద్ద ఆదివారం జరిగింది. మేడారంలో వార్తల సేకరణకు వెళ్లిన విలేకరులు మారెపల్లి చంద్రమౌళి, బొమ్మ రమేష్, సాంబమూర్తి తిరిగి భూపాలపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మరో మోటార్‌సైకిల్ ఢీకొంది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. వారిని 108 ద్వారా స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 11: రోడ్డు ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని లింగాపూర్ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం భైరాన్‌పల్లికి చెందిన లోకిని తరుణ్ (25) ట్రాలీ ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో పలు సావగ్రి లోడును తీసుకొని ట్రాలీతో అతడు వస్తుండగా హనుమకొండ వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తరుణ్ ట్రాలీలోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాలీలో ఉన్న విజయ్, సరోజ గాయపడ్డారు. సంఘటన స్థలాన్ని ఎస్సై రాజు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి ఇద్దరు క్షతగాత్రులను ములుగు ఏరియా ఆస్పత్రికి పంపారు. మృతుడు అవివాహితుడని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్ దుర్మరణం

కన్యకా ఆత్మార్పణ దినోత్సవ పూజలు

మహదేవపూర్, ఫిబ్రవరి 11: కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అర్చన, అభిషేకం చేశారు. లలితాసహస్ర నామావళి, భజన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుడాల అరుణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిటికెశి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి మనోజ్, కోశాధికారి జగదీశ్వర్, సహాయ కార్యదర్శి మహేశ్ తదితరులున్నారు.


పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

● మల్హర్, : మండల కేంద్రమైన తాడిచర్లలో ఆదివారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని మండల ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెంకటేశ్వర ఆలయంలో వాసవీ మాత చిత్రపటానికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్యామ్‌సుందర్ శర్మ, ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు కుక్కుడపు అశోక్, ఒల్లాల రమేష్, రేపాల హరీశ్, కుక్కుడపు వెంకటేశ్వర్లు, కొడిమ్యాల భాస్కర్, బెజ్జం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 11 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల మంగళవారం మేడిగడ్డ బ్యారేజీ పర్యటించనున్న నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. మహదేవపూర్ నుంచి మేడిగడ్డ వరకు రోడ్లను పరిశీలించడంతోపాటు బ్యారేజీ వద్ద సభాస్థలి, జర్నలిస్టులకు, వీఐపీలకు భోజన సౌకర్యానికి సంబంధించిన ప్రదేశాలను చూశారు. బ్యారేజీ ప్రాంతంలో ఎక్కడ ఎం ఎర్పాటు చేయాలో అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతాపరంగా చేపట్టాల్సిన ఎర్పాట్లపై ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలను పరిశీలించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన 20 పిల్లరుతోపాటు వంతెను, బ్యారేజీ కింద గోదావరి నది లోపలికి దిగి పగుళ్ల తేలిన పిల్లర్లను ముఖ్యమంత్రి పరిశీలించే అవకాశం ఉండటంతో అక్కడి వరకు వెళ్లేందుకు మార్గాల్లో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖ అధికారులకు సూచనలు చేశారు. ప్రధానంగా సభాస్థలి వద్ద ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఎమ్మెల్యేలకు కల్పించాల్సిన సౌకర్యాలపై వివరించారు. దీనికి ముందు అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్ టీ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ శాఖ పరంగా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు.

భద్రతాపరమైన ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ, ఎస్పీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు రోడ్డు మార్గంలో రానుండటంతో భద్రతా పరమైన ఏర్పాట్లను ఐజీ శ్రీనివాస్, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పరిశీలించారు. మేడారం మహాజాతరకు కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనతో పాటు పలిమెల వైపు నుంచి భక్తులు వాహనాల్లో వెళ్లే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుతం మహదేవపూర్ సర్కిల్‌లో విధుల్లో ఉన్న ఎస్సై, సీఐలు ఇద్దరు ఇటీవలే బదిలీపై రాగా ఏర్పాట్లలో గతంలో అనుభవం ఉన్న అప్పటి పోలీసు అధికారులను పిలిపించి తగిన ఏర్పాట్లు చేయిస్తున్నారు. బ్యారేజీ వంతెన, గోదావరి నదిలోకి మహారాష్ట్ర వైపు నుంచి వెళ్లే మార్గంలో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.


మేడిగడ్డ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అతిథులకు కానుకగా ముక్తీశ్వరుడి ప్రసాదం

తొలిసారి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు సహా పలువురు అతిథులకు కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఈవో మహేష్‌కు లడ్డూ ప్రసాదాలను సమకూర్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వామివారి చిత్రపటాలను సైతం అందించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, డీపీవో ఆశాలత, జడ్పీ సీఈవో జయలక్ష్మి, డీఎల్‌పీవో సుధీర్ కుమార్, డీఎంహెచ్‌వో, సీపీవో శామ్యూల్ డీపీఆర్‌వో శ్రీధర్, అడిషనల్ ఎస్పీ తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రవీంద్రనాథ్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సై ప్రసాద్‌తోపాటు ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కాటారం, ఫిబ్రవరి 11:మండలంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల్లో 2024-2025 విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశం పొందడానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గంగారంలోని మోడల్ పాఠశాల, మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకుల విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 902 మంది విద్యార్థులు ప్రవేశపరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 815మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ సీఎస్‌లు మధు, బుచ్చయ్య, శైలజ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో 41 మంది, ఎస్టీ బాలుర గురుకులంలో 29మంది, ఎస్టీ బాలికల గురుకులంలో 17 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు గైర్హాజరయ్యారని వారు వెల్లడించారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలి : నాగజ్యోతి

మంగపేట, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ములుగు జడ్పీ చైర్‌పర్సన్, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, చెరుపల్లి, బుచ్చంపేట, తిమ్మంపేట తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె ఆదివారం పర్యటించారు. పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యాలతో బాధపడుతున్న కార్యకర్తలను పరామర్శించారు. బుచ్చంపేటలో కార్యకర్తలతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పార్టీని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, సహకార సంఘం డైరెక్టర్ చిట్టిమల్ల శ్రీలత, తాడ్వాయి మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, ఏటూరునాగారం మాజీ ఎంపీపీ కోనేరు నగేష్, మాజీ ఎంపీటీసీలు మాదారి రామయ్య, కొమరం రామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు చిట్టిమల్ల సమ్మయ్య, యలమర్తి శ్రీనివాస్, ఈసం రామ్మూర్తి, మండల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : ఇటీవల మృతి చెందిన మండల కేంద్రానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు గుర్రం కనకయ్య కుటుంబ సభ్యులను జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి పరామర్శించారు.పార్టీ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజాపాషా, మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కూనూరు మహేష్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య, మాజీ ఎంపీపీ కోనేరు నగేష్ తదితరులు పాల్గొన్నారు.


బుచ్చంపేటలో కార్యకర్తలతో నాగజ్యోతి